క్లుప్తంగా

99 శాతం పింఛన్ల పంపిణీ



కాకినాడ జీజీహెచ్‌లో మార్తమ్మకు పింఛన్ అందిస్తున్న సచివాలయ సిబ్బంది

కడియం: మండల పరిధిలో 99 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో జి.రాజ్ మనోజ్ తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన సమయానికి లక్ష్యాన్ని చేరుకున్నామన్నారు. వీరవరం సచివాలయం 2 పరిధిలోని తోట మార్తమ్మ కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. తమ సచివాలయ సిబ్బంది అక్కడికి వెళ్లి పింఛన్ అందజేశారన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



కడియంలో మాట్లాడుతున్న డీఈవో వాసుదేవరావు

కడియం: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు అన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆదివారం కడియంలో ఓటర్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక విద్యా వనరుల కేంద్రం నుంచి దేవీ సెంటర్ వరకూ ఈ కార్యక్రమం జరిగింది. బొబ్బిలి బ్రిడ్జి సెంటర్లో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమన్నారు. కడియం ఎంఈఓలు మణికుమార్, వై.నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు టి.సత్యనారాయణ, ఈవీఎస్ఆర్ ప్రసాద్, విశ్వనాథం, సుధ, చిలుకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'వీధిబడి' కవితకు పురస్కారం

కడియం: కవి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు రచించిన వీధిబడి కవితకు ఉత్తమ పురస్కారం లభించింది. కొత్తపేట కళాసాహితీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కవితా సమ్మేళనం ఆయనకు కవితకు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో కళాసాహితి అధ్యక్షుడు పెనుమత్స హరిహర దేవళ రాజు, ప్రధాన కార్యదర్శి గిడ్డు సుబ్బారావు, తెలుగు ప్రొఫెసర్ టీఎస్ సత్యనారాయణ, ప్రముఖ కవి జోస్యుల కృష్ణబాబు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు గొడుగుల వితరణ

ప్రకాశం నగర్: స్వర్ణాంధ్ర ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వీఎల్ పురంలోని రైతు బజారు వద్ద చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ జక్కంపూడి బ్లడ్ బ్యాంక్ డైరెక్టర్ ఎంఆర్కే పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వర్ణాంధ్ర నిర్వాహకుడు గుబ్బల రాంబాబు మాట్లాడుతూ గొడుగులు అవసరమైన చిరువ్యాపారులు ఆధార్ కార్డు, రెండు ఫొటోలు తీసుకుని లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమానికి రావాలని కోరారు. కార్యక్రమంలో పిడింగొయ్యి కిరణ్, శ్రీనివాస్, స్వర్ణాంధ్ర కార్యదర్శి గంగాధర్ పాల్గొన్నారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

కంబాలచెరువు: దేశీయ వైద్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక విక్రమహాలులో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు సచ్చిన శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఆకాశం గౌరీష్ బాబు మాట్లాడుతూ ప్రస్తుతం అంటు వ్యాధుల కంటే జీవనశైలి వ్యాధులు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ప్రజలు ఒత్తిడికి గురవుతూ మానసిక అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. మధుమేహం, రక్తపోటు, కేన్సర్ వంటి రోగాలు పెరిగిపోయాయన్నారు. వీటిని అధిగమించేందుకు వ్యాయామం, యోగాకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

సినిమాలు



శ్యామల	: ది ఫ్యామిలీ స్టార్
సూర్యమినీ	: గాడ్జిల్లా అండ్ కాంగ్
సూర్యప్యాలెస్	: మంజుమ్మల్ బాయ్స్
స్వామి	: ది ఫ్యామిలీ స్టార్
శివజ్యోతి	: ది ఫ్యామిలీ స్టార్
అనుశ్రీ	: మంజుమ్మల్ బాయ్స్
రాజా	: ది ఫ్యామిలీ స్టార్
ఊర్వశి	: ఓంభీమ్‌బుష్
రంభ	: గాడ్జిల్లాఅండ్‌కాంగ్
మేనక	: భరతనాట్యం
అప్సర	: టిల్లుస్క్వేర్
కుమారి	: టిల్లుస్క్వేర్
నామవరం	
వీఎస్ మహల్	: ది ఫ్యామిలీ స్టార్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: ది ఫ్యామిలీస్టార్, టిల్లుస్క్వేర్
కడియం	
వెంకటసూర్య	: ది ఫ్యామిలీస్టార్

జగనన్నను సీఎంగా గెలిపించుకుందాం

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- పార్టీలో భారీగా చేరికలు



ఆటో యూనియన్ కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణు



కార్మికులకు బీమా కార్డులు పంపిణీ చేస్తున్న గొందేశి శ్రీనివాసులురెడ్డి, మంత్రి వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: పేదలకు మంచిచేసే జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేనుగోపాలకృష్ణ పిలుపునిచ్చారు. హుకుంపేట వరలక్ష్మీ కాలనీలో ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకుడు చెల్లుబోయిన సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఆ ప్రాంతానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు మల్లా నూకరాజు సారథ్యంలో రాజేష్ ఫ్రెండ్స్ సర్కిల్, మహిళలు 500 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలు వేసి మంత్రి వేణు ఆహ్వానించారు.

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం

చెల్లుబోయిన మూర్తి అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి వేణు మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలుపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాబోయే ఎన్నికల యుద్ధంలో పేదల పక్షాన జగన్ ఉంటే, ఆవతలి పక్కన పచ్చ మీడియా, దత్త పుత్రుడు, బీజేపీ ఉన్నాయన్నారు. ఎవరు ఎన్ని జెండాలతో వచ్చినా ఈ ఎన్నికల్లో అంతిమ విజయం వైఎస్సార్ సీపీదేనన్నారు. చెల్లుబోయిన సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గంలో వేణును భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హుకుంపేట సొసైటీ చైర్మన్ బొప్పన సుబ్బారావు, పార్టీ నాయకులు పసలపూడి శ్రీనివాస్, మేడి త్రిమూర్తులు, పడాల రాఘవరెడ్డి, పిల్లా లక్ష్మణరావు, మార్గాని చంటిబాబు, చీరా రాజు, సిరిసపల్లి శంకరరావు, ఇబ్రహీం బాషా, కడలి పెద్ద కాపు, కడలి రాంబాబు, నరసింహారావు పాల్గొన్నారు.

500 మంది ఆటో కార్మికుల చేరిక

రాజమహేంద్రవరం రూరల్: ఎమ్మెల్యేగా చెల్లుబోయిన వేణు, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లను గెలిపించుకుందామని ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టి బలిజ సంఘం అధ్యక్షుడు, లక్ష్మీగణపతి ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు పిల్లి సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. శాటిలైట్ సిటీలోని లక్ష్మీగణపతి ఆటోయూనియన్‌కు చెందిన 500 మంది కార్మికులు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక శాటిలైట్ సిటీలోని జక్కంపూడి కల్యాణం మంటపంలో పిల్లి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి వేణుగోపాలకృష్ణ హాజరయ్యారు. పార్టీలో చేరిన దుంగా రాజు, లంకా శివ, షేక్ బషీర్, వాసంశెట్టి కిరణ్, మెడపాటి వాసు, యర్రా వాసు, కంచే దుర్గతో పాటు పలువురు ఆటో కార్మికులు, మహిళలకు కండువాలు వేసి ఆహ్వానం పలికారు. మంత్రి వేణు మాట్లాడుతూ 58 నెలల పాలనలో సీఎం జగన్ అందరి మన్ననలు పొందారన్నారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ సతీమణి, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి రాధిక మాట్లాడుతూ పార్టీ కోసం నెల రోజులు మీరంతా పనిచేస్తే, మేమంతా ఐదేళ్ల పాటు మీకు సేవలు అందిస్తామన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం కార్యదర్శి పిల్లి సిరిబాల, ఖాదీబోర్డు వైస్ చైర్మన్ పిల్లి నిర్మల, మాజీ సర్పంచ్ రుంకాని రమణమ్మ, మాజీ ఉపసర్పంచ్‌లు బొమ్ము శ్రీను, కడవకొల్లు వెంకట రమణరావు పాల్గొన్నారు.

కార్మికులకు బీమా కార్డుల పంపిణీ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కార్మికుల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని మంత్రి, వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. స్థానిక బాలాజీపేటలోని గొందేశి మెన్షన్‌లో ఆదివారం ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో ఐదుబళ్ల మార్కెట్ ప్రాంతానికి వడ్రంగి, పెయింటర్, సెంటరింగ్ వర్కర్స్, తాపీమేస్త్రీల అసోయేషన్ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ అర్హత ఉన్నవారందరికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సంక్షేమ పథకాలు నిర్విరామంగా అమలు కావాలంటే ఆయనను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం గొందేశి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్మికులకు చేయించిన ఇన్సూరెన్స్ కార్డులను సంస్థ వ్యవస్థాపకుడు శ్రీనివాసులురెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, 18వ డివిజన్ ఇన్‌చార్జి దమ్ము ప్రసాద్, కుడిపూడి గిరి, కార్మిక యూనియన్ ప్రతినిధులు కాకర శంకర్, దుంగా కామరాజు, రీసు రాంబాబు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు జగన్‌తోనే సాధ్యం



ధవళేశ్వరంలో ప్రచారం చేస్తున్న షర్మిలారెడ్డి, ఉమా శంకర్

ధవళేశ్వరం: సంక్షేమ పథకాల అమలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే సాధ్యమని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. ధవళేశ్వరంలోని వాడపేట, పాతపేట తదితర ప్రాంతాల్లో మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తనయుడు చెల్లుబోయిన ఉమాశంకర్‌తో కలిసి ఆదివారం సాయంత్రం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా చెల్లుబోయిన వేణు, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. చంద్రబాబు కుయుక్తులను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు చంద్రబాబు కారణంగానే పింఛన్‌దారులు అవస్థలు పడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సాధనాల చంద్రశేఖర్ (శివ),తలారి వరప్రసాద్, గరగ శ్రీనివాసరావు, బర్రి కామేశ్వరరావు, మిరప రమేష్, ముత్యాల జాన్, గూటం రాజు, ఎల్‌వీ ప్రసాద్, మెండా రాజేష్, నంబూరి రవి, ధర్మ పాల్గొన్నారు.

చెప్పింది చేయడమే జగన్ నైజం



శాటిలైట్ సిటీ ఏ బ్లాకులో పార్టీలో చేరిన వారితో మంత్రి వేణు, పిల్లి సుబ్రహ్మణ్యం

- నవరత్నాలతో ఆదర్శ పాలన
- మంత్రి వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: ఇచ్చిన మాట నెరవేర్చడం, చెప్పిన పని చేయడమే సీఎం జగన్ నైజమని మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. శాటిలైట్ సిటీలో ఆదివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టోల్‌గేట్ సెంటర్ నుంచి మంత్రి వేణుగోపాలకృష్ణను భారీగా బైక్‌లు, ఆటోల ర్యాలీతో ఏ బ్లాకుకు తీసుకుని వచ్చి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలను ఓట్లు అడిగే అర్హత వైఎస్సార్ సీపీకే ఉందన్నారు. చంద్రబాబు మాదిరిగా గారడీ విద్యలతో ప్రజలను మోసగించడం జగన్‌కు అలవాటు లేదన్నారు. రాబోవు ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు.

వైఎస్సార్ సీపీలో 300 మంది చేరిక

ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు పిల్లి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఏబ్లాకు వైఎస్సార్ సీపీ నేతల సమక్షంలో తూర్పుకాపు, శెట్టిబలిజ, విశ్వబ్రహ్మణ, బుడగజంగాలు తదితర కులాల నుంచి సుమారు 300 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి మంత్రి వేణుగోపాలకృష్ణ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజు, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ సతీమణి, రాష్ట్ర లీగల్‌సెల్ సెక్రటరీ గూడూరి రాధిక, రాష్ట్ర ఖాదీబోర్డు వైస్ చైర్మన్ పిల్లి నిర్మల పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి

- ఎంపీ, సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌రామ్
- వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



పద్మశాలీ సంఘం ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్, చిత్రంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి జగనన్న ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ అన్నారు. నగరంలోని బర్మా కాలనీలోని టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన వారితో పాటు కాలనీ ప్రజలందరూ ఏకాభిప్రాయంతో ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా డివిజన్ ఇన్‌చార్జులు దాసి వెంకట్రావు, చంటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంపీ భరత్‌రామ్ హాజరయ్యారు. పార్టీలో చేరిన వారందరికీ కండువాలు వేసి ఆహ్వానించారు.

సంక్షేమ పథకాలతో అభ్యున్నతి

ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ బర్మా, శ్రీలంక, తమిళనాడు నుంచి దాదాపు 60 ఏళ్ల క్రితం ప్రజలు ఇక్కడకు వచ్చి స్థిరపడ్డారన్నారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో ఇక్కడి కష్ట జీవులు, సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయని తెలిపారు. అందుకే బర్మా కాలనీ వాసులందరూ వైఎస్సార్ సీపీలో చేరడానికి సంఘటితంగా తీర్మానించుకోవడం శుభపరిణామమన్నారు. దాదాపు 2 వేలమంది ఒకే మాటపై పార్టీలో చేరుతున్నారంటే జగనన్న పాలనపై నమ్మకానికి ఒక నిదర్శనమన్నారు. టీడీపీ పాలనలో నగర అభివృద్ధి కుంటుపడిందన్నారు. నారా చంద్రబాబు నాయుడి మాటలు నమ్మితే మోసపోవడం ఖాయమన్నారు. జగనన్న ఏర్పాటు చేసిన వలంటీర్లు ప్రతినెలా ఒకటో తేదీన అవ్వాతాతలు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ అందించేవారన్నారు. వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయకుండా సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని భర్త శ్రీనివాస్ అడ్డుకోవడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 39 మంది పెన్షన్ లబ్ధిదారులు మృత్యువాత పడ్డారన్నారు. ఇటువంటి వాళ్లను ప్రజాప్రతినిధులుగా ఎన్నుకుంటే రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాలిక శ్రీనివాస్, వాసంశెట్టి గంగాధర్, కడియాల శ్రీను పాల్గొన్నారు.



బర్మా కాలనీలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

పద్మశాలి కల్యాణ మంటపం నిర్మించి తీరుతాం

సీటీఆర్ఐ: ఎవరెన్ని ఆటంకాలు సృష్టించినా పద్మశాలి కల్యాణ మంటపం నిర్మించి తీరుతామని ఎంపీ, సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌రామ్ అన్నారు. స్థానిక జయరాం థియేటర్‌లో ఆదివారం పద్మశాలీ సంఘం ఆత్మీయ సమావేశం జరిగింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ బీసీల అభివృద్ధిని అడ్డుకుంటున్న తెలుగుదేశం పార్టీకి ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని కోరారు. పద్మశాలి కల్యాణ మంటపం నిర్మాణానికి 720 గజాల స్థలాన్ని మంజూరు చేశానని, నిర్మాణానికి రూ.25 లక్షలు కేటాయించినట్టు గుర్తు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైనా రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ పద్మశాలి కల్యాణ మండపం నిర్మాణానికి ఎంపీ భరత్ నిధులు ఇచ్చి కృషి చేస్తుంటే ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తాను రుడా నుంచి రూ.30 లక్షలు మంజూరు చేసేందుకు కృషి చేశానన్నారు. ప్రతిపక్ష టీడీపీ రాజకీయ కుయుక్తులను తూర్పారబట్టాలని, సిటీ ఎమ్మెల్యేగా మార్గాని భరత్‌రామ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘాల ఐక్యవేదిక ఉద్యమ నాయకులు మార్గాని నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పద్మశాలి సంఘ నాయకులు జామిశెట్టి గాంధీ, ఎర్రమోతు ధర్మరాజు, సప్పా ఆదినారాయణ, నీలం గణపతి, నరసింహమూర్తి, నందం స్వామి, మార్గాని సురేష్ పాల్గొన్నారు.

చంద్రబాబుపై ప్రజలకు నమ్మకం లేదు



కూనవరంలో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: చంద్రబాబు అండ్ కోపై ప్రజలకు నమ్మకం పోయిందని, వైఎస్సార్ సీపీలోకి పెరుగుతున్న చేరికలే దానికి నిదర్శనమని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆయన శనివారం రాత్రి కూనవరంలో పర్యటించారు. ఇంటింటికి తిరిగి ప్రజలతో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన పీతల ప్రసాద్, జాన్ ఏసు, ప్రత్తిపాటి వీరమ్మ, మంగ, ప్రత్తిపాటి బోసులతో పాటుగా 150 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే రాజా పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానం పలికారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలందరి జీవితాల్లో అభివృద్ధి వెలుగులు విరబూసాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను, ముఖ్యమంత్రిగా జగన్‌ను గెలిపించాలని కోరారు. అమలు కాని హామీలు ఇచ్చి, కూటములు కట్టి, కులాల మధ్య చిచ్చుపెడుతున్న ప్రతిపక్ష పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కూనవరంలో మౌలిక వసతులు కల్పించి, గ్రామాభివృద్ధికి చర్యలు తీసుకున్నామన్నారు. రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుంకర గంగాలక్ష్మి, ఉప సర్పంచ్ మండపాక గణేష్, ఎంపీటీసీ నల్లమోలు భాస్కర్, అయిల మధు, నల్లమోలు పాపారావు, నల్లమోలు నూకరాజు, అయిల పాపారావు, మేండ్రు పిచ్చయ్య, అడప బ్రహ్మజీరావు పాల్గొన్నారు.

జోరుగా ఎన్నికల ప్రచారం

మధురపూడి: కోరుకొండ మండలంలో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. వైఎస్సార్ సీపీ నాయకులు విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. మండలంలోని బూరుగుపూడి శివాలయం పరిసర ప్రాంతంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. వ్యవసాయ సలహామండలి జిల్లా సభ్యుడు, పార్టీ నాయకుడు కంటే వినయ్‌తేజ ఆధ్వర్యంలో నాయకులు పర్యటించారు. అనంతరం తేజ మాట్లాడుతూ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నియోజవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టించారన్నారు. 22 వేలమంది పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేసిన ఘనత ఆయనదేనన్నారు. మాజీ ఎంపీటీసీ మాజీ సభ్యుడు పిట్టా కృష్ణ పాల్గొన్నారు.

సాధ్వి సాధికార సంస్థ ప్రారంభోత్సవం

సీటీఆర్ఐ: స్థానిక త్యాగరాజ భవనంలో ఆదివారం సాధ్వి సాధికారిక సంస్థ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. వ్యవస్థాపకురాలు ద్రోణంరాజు కాత్యాయని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కంచి పరమాచార్య మహా విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ గుళ్లపల్లి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ దేశంలో పూర్వకాలం మహిళల ఆధిపత్యమే ఉండేదన్నారు. సంప్రదాయ విద్యతో పాటు ఆధునిక విజ్ఞాన విద్యను తమ విశ్వవిద్యాలయంలో బోధిస్తామన్నారు. శతావధాని తాతా సందీప్ శర్మ మాట్లాడుతూ మహిళా చైతన్యం వచ్చినప్పుడే సమాజంలో మార్పులు వస్తాయన్నారు. జీఎస్ఎల్ ఆసుపత్రి అధినేత డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాఈడుతూ సంస్థ ఉన్నతంగా ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. కవి, పండితుడు ఎర్రా ప్రగడ రామకృష్ణ, రాజమహేంద్రి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, జక్కంపూడి విజయలక్ష్మి, పండితులు ప్రభల సుబ్రహ్మణ్య, మాదిరాజు శ్రీనివాస్, నాట్యాచార్యులు పసుమర్తి శ్రీనివాస్, మృదంగ విద్వాంసులు కమలాకర యోగిష్, వేలూరి తులసి తదితరులను సత్కరించారు.



మాట్లాడుతున్న కంచి మహా విశ్వవిద్యాలయం ఉపకులపతి శ్రీనివాస్

స్వాతంత్ర్య సమరయోధుల పార్కు సందర్శన

రాజమహేంద్రవరంలోని స్వాతంత్ర్య సమరయోధుల పార్కును కంచి మహా విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ గొల్లపల్లి శ్రీనివాస్ ఆదివారం సందర్శించారు. ఆయనకు ఆంధ్రకేసరి యువజన సమితి అధ్యక్షుడు దేశిరెడ్డి బలరామ నాయుడు, కార్యదర్శి మాదిరాజు శ్రీనివాస్ స్వాగతం పలికారు. 12 మంది స్వాతంత్ర్య మహిళామణుల విగ్రహాలను చూసి ఆయన ఆనంద వ్యక్తం చేశారు. పార్కు నిర్మాత సమితి వ్యవస్థాపకుడు స్వర్గీయ వైఎస్ నరసింహారావు, ప్రకాశం పంతులు విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో రాజమండ్రి రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోట సుబ్బారావు, రచయిత, గాయకుడు నూజెళ్ళ శ్రీనివాస్, బ్రాహ్మణ నాయకుడు యామిజాల నరసింహమూర్తి పాల్గొన్నారు.

నూకాలమ్మకు బంగారు మంగళ సూత్రం సమర్పణ

రాజానగరం: గ్రామ దేవత నూకాలమ్మ జాతర, తీర్థ మహోత్సవాలను పురస్కరించుకుని గ్రామానికి చెందిన ముచ్చకర్ల మూలయ్య, జగ్గాయమ్మ దంపతుల జ్ఞాపకార్థం అమ్మవారికి బంగారు మంగళ సూత్రం, చిన్న విగ్రహానికి వెండి కిరీటాలను ఆదివారం బహూకరించారు. వీటి విలువ సుమారు రూ.3.70 లక్షలని దాతలు తెలిపారు. కాగా.. నూకాలమ్మ జాతరను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గరగ నృత్యాలు, శక్తి వేషాలు, విచిత్ర వేషధారణతో జాతరను ఘనంగా జరిగింది. జాతరలో భాగంగా ఉదయం గ్రామంలో తాటిచెట్టును ఊరేగించారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు, జేసీబీ సీజ్

రంగంపేట: అక్రమంగా మట్టి తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు, జేసీబీని సీజ్ చేసినట్టు తహసీల్దార్ లతీఫ్ పాషా తెలిపారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దొడ్డిగుంట గ్రామంలో ఉన్న రామేశ్వరంపేట సత్రానికి చెందిన భూమిలో శనివారం అర్ధరాత్రి నల్లమిల్లి గ్రామానికి చెందిన కొండేపూడి బాలయ్య నాలుగు ట్రాక్టర్లు, జేసీబీ సాయంతో అక్రమంగా మట్టి తరలిస్తుండగా పోలీసుల సాయంతో దాడి చేసి పట్టుకున్నామన్నారు.

వీటీ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కార్యక్రమానికి హాజరైన పూర్వ విద్యార్థులు

కంబాలచెరువు: స్థానిక వీటీ జూనియర్ కాలేజీలో 1972 – 74 బ్యాచ్ ఇంటర్మీడియట్ బైపీసీ విద్యార్థుల గోల్డెన్ జూబ్లీ వేడుక ఆదివారం జరిగింది. ఇంటర్ పూర్తి చేసి 50 ఏళ్లయిన నేపథ్యంలో వారంతా ప్రకాశం నగర్ ధర్మంచర కమ్యూనిటీ హాలులో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, ఆనాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. ప్రతిఏటా ఇలాగే కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ దాట్ల భాస్కరరాజు, ప్రసాదరాజు, డీఎస్ఎన్ రాజు, రాపాక వీరభద్రస్వామి, కేదారి, కె.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో టిల్లు సందడి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): డీజే టిల్లుకు సీక్వెల్‌గా వచ్చిన టిల్లు స్క్వేర్ చిత్ర యూనిట్ ఆదివారం రాజమహేంద్రవరంలో సందడి చేసింది. చిత్ర విజయోత్సవ యాత్రలో భాగంగా స్థానిక అప్సర థియేటర్‌లో హీరో సిద్ధు జొన్నలగడ్డ, డైరెక్టర్ మల్లిక్‌రామ్, సంగీత దర్శకుడు రామ్ మిరియాల ప్రేక్షకులతో కొద్దిసేపు సందడి చేశారు. హీరో సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ యువతతో పాటు కుటుంబ సమేతంగా చూడదగిన సినిమా టిల్లు స్క్వేర్ అన్నారు. ఈ చిత్రం వసూలు రూ.100 కోట్లకు చేరువ కావడం ఆనందంగా ఉందన్నారు. కథాబలం ఉంటే భాష, యాసతో సంబంధం లేకుండా చిత్రాలను ప్రేక్షకులు విజయవంతం చేస్తారన్నారు. డీజే, టిల్లు స్క్వేర్‌కు కొనసాగింపుగా కథను రెడీ చేస్తున్నామని వెల్లడించారు. చిత్ర దర్శకుడు మల్లిక్‌రామ్ మాట్లాడుతూ ప్రతి చోట కలెక్షన్లు బాగా వస్తున్నాయని, తమను ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటర్ విజయలక్ష్మి సినిమాస్ అధినేతలు దుర్గారెడ్డి, అంజిరెడ్డి, అప్సరా థియేటర్ యజమాని హరీష్, మేనేజర్ మధు పాల్గొన్నారు.



అప్సరా థియేటర్‌లో మాట్లాడుతున్న హీరో సిద్ధు జొన్నలగడ్డ